క్లుప్తంగా...

ప్రధాని తొమ్మిదేళ్ల పాలనలో ఎంతో అభివృద్ధి



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ

చార్మినార్: ప్రధాని నరేంద్ర మోదీ 9 ఏళ్ల పాలనలో దేశ వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజల సంక్షేమంతో పాటు రాష్ట్రంలో కూడా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ అన్నారు. శనివారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి తొమ్మిదేళ్లుగా జరిగిన అభివృద్ధిని వివరించడం జరిగిందన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఏఈ మల్లికార్జున్

చార్మినార్: ఈసారి జరిగే ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకొని పాతబస్తీలోని అవసరమైన అన్ని ఆలయాల వద్ద కార్యక్రమాలను చేపట్టడానికి జీహెచ్ఎంసీ అధికారులు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా చావునీ మున్సిపల్ డివిజన్ డబుల్ బెడ్‌రూం కాలనీలోని ముత్యాలమ్మ ఆలయం వద్ద అభివృద్ధి పనులు చేపట్టడానికి జీహెచ్ఎంసీ వార్డు ఏఈ మల్లికార్జున్, వర్క్ ఇన్‌స్పెక్టర్ వాహీద్ తదితరుల బృందం శనివారం సందర్శించి వివరాలు సేకరించింది. మల్లికార్జున్ మాట్లాడుతూ.. బోనాల జాతర ఉత్సవాల కన్న ముందే ముత్యాలమ్మ ఆలయం వద్ద అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేస్తామన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి



రామ్మోహన్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న రాజు ముదిరాజ్

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని టీడీపీ చాంద్రాయణగుట్ట డివిజన్ అధ్యక్షుడు రాజు ముదిరాజ్ కోరారు. ఈ మేరకు శనివారం బండ్లగూడ మండల డిప్యూటీ ఐఓఎస్ రామ్మోహను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాజు ముదిరాజ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సదుపాయాలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. కొన్ని పాఠశాలల్లో పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులు సైతం లేని పరిస్థితి నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింగ్‌రావు, సతీష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

సన్మానం



ఏఐసీసీ నాయకులు మన్సూర్ అలీఖాన్‌ను సన్మానిస్తున్న నిర్మల్‌కుమార్ యాదవ్

అబిడ్స్: ఏఐసీసీ నాయకులను గోషామహల్ నియోజకవర్గానికి చెందిన టీపీసీసీ కార్యదర్శి నిర్మల్‌కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. నగరానికి వచ్చిన ఏఐసీసీ కార్యదర్శి మన్సూర్ అలీఖాన్‌తో పాటు విశ్వనాథ్‌లను నిర్మల్‌కుమార్ యాదవ్ ఘనంగా సత్కరించి స్వాగతం పలికారు.

నర్సరీ యాజమాన్యంపై రైతులకు శిక్షణ

ఏజీవర్సిటీ: రైతులు కూరగాయల విత్తనాలను ఆధునిక పద్ధతిలో వినియోగించుకోవడం ద్వారా ఖర్చులు తగ్గించుకుని అధిక దిగుబడులతో పాటు నాణ్యమైన పంటలను అందించవచ్చని వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ నరేంద్రరెడ్డి అన్నారు. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి సహకారంతో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో ఉద్యాన పంటల్లో నర్సరీ యాజమాన్యంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కేబీ ఈశ్వరి పాల్గొని రైతులకు నారు మళ్లపై పలు సలహాలు, శిక్షణలు ఇచ్చారు. నారు మడిని అధునిక పద్ధతుల ద్వారా పెంచుకోవాలని సూచించారు. సాంకేతిక శిక్షణలో రైతులకు ప్లగ్ ట్రే విధానంలో కూరగాయల విత్తనాల వినియోగంపై రైతులకు వివరించారు. మామిడిలో అంటుకట్టు విధానం ద్వారా మొక్కల పెంపకంపై వివరించారు.

సమాజ సేవతోనే మనిషికి తృప్తి



విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్, విద్యావేత్త జితేందర్ సింగ్

అబిడ్స్: సమాజ సేవతోనే మనిషికి ఎంతో తృప్తి, ఆనందం కలుగుతుందని గోషామహల్ నియోజకవర్గం ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. స్వచ్ఛంద సంస్థలతో పాటు ప్రతిఒక్కరూ సమాజ సేవకు తమ వంతు సహకారం అందించాలన్నారు. శనివారం ధూల్‌పేట గంగాబౌలిలో హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ ట్రస్టీ గోపాల్‌సింగ్ ఖేలేవాలే ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నోటుబుక్స్, బ్యాగుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజాసింగ్ పాల్గొని ప్రసంగించారు. హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ చేస్తున్న సేవలు అమోఘమని కొనియాడారు. కొన్ని సంవత్సరాలుగా ధూల్‌పేట్‌తో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రస్టీ గోపాల్‌సింగ్ ఖేలేవాలే తరచూ సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. పేద, బడుగువర్గాల ప్రజల కోసం హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ చేస్తున్న కృషి తనకెంతో తృప్తినిచ్చిందని రాజాసింగ్ పేర్కొన్నారు. 1200 మంది విద్యార్థులకు నోట్‌బుక్స్, బ్యాగ్‌లను ఉచితంగా పంపిణీ చేశారు. కార్పొరేటర్లు లాల్‌సింగ్, మాజీ కార్పొరేటర్ పరమేశ్వరి సింగ్, రిలయన్స్ హైటెక్ స్కూల్ విద్యాసంస్థల చైర్మన్, విద్యావేత్త జితేందర్ సింగ్, బద్రినాథ్ సింగ్, యోగేష్ సింగ్, బల్‌దేవ్ సింగ్, దీపావాలే శైలేందర్ సింగ్, దాల్‌వాలే యుద్వీర్ సింగ్, వీరేందర్ సింగ్, నరేష్ సింగ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యే కౌసర్‌కు ఆహ్వాన పత్రం అందజేస్తున్న కాజా జౌహార్ అలీ

గోల్కొండ: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణ రాష్ట్రంలోనే ఒక ప్రత్యేక ఘట్టమని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. జలమండలి ఆధ్వర్యంలో నేడు జరిగే తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలకు రావాల్సిందిగా కోరుతూ షేక్‌పేట్ జమండలి డీజీఎం ఖాజా జౌహర్ అలీ శనివారం ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఉత్సవాలు తాము రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తున్నామని, మజ్లిస్ నాయకులు, కార్యకర్తలు దశాబ్ది ఉత్సవాల్లో భారీ సంఖ్యలోపాల్గొంటున్నారని ఆయన అన్నారు. నేడు కార్వాన్ మొఘల్ గార్డెన్‌లో జరిగే ఈ దశాబ్ది ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని డీజీఎం ఖాజా జౌహర్ అలీ తెలిపారు.

గర్శకుర్తి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలి

నాంపల్లి: కరీంనగర్ జిల్లాలోని గర్శకుర్తి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని ఓయూ జేఏసీ నేత సిరిమల్లె వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం నాంపల్లిలోని గన్‌పార్కు ఎదుట స్థానిక గ్రామ ప్రజలతో కలిసి ఆయన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ అమరవీరుల స్థూపానికి నివాళులర్పించి ప్రసంగించారు. గతంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. గర్శకుర్తి గ్రామాన్ని మండల కేంద్రంగా చేయడానికి అన్ని విధాలుగా అనుకూలంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బంటు సందీప్, ఆశ మైత్రి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

'బీసీ బంధు'లో అధికారుల నిర్లక్ష్యం



నిరసన వ్యక్తం చేస్తున్న మంగళ్‌హాట్ కార్పొరేటర్ శశికళ కృష్ణ

అబిడ్స్: బీసీ బంధు పథకంలో అధికారుల నిర్లక్ష్యంతో బీసీ బంధులంతా ఇబ్బందులు పడుతున్నారని మంగళ్‌హాట్ కార్పొరేటర్ శశికళ కృష్ణ ఆరోపించారు. ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో సర్వర్ పని చేయడం లేదని బీసీ సర్టిఫికెట్లు ఇవ్వకుండా ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ప్రజల ఇబ్బందులను తెలుసుకున్నారు. సర్వర్ పనిచేయడం లేదని అధికారులు తెలపడంతో ఆమె అధికారులకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. అనంతరం శశికళ కృష్ణ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేస్తుందని ఆరోపించారు. 130 కులాలు ఉన్న బీసీలలో కేవలం 43 కులాలకు బీసీ బంధు ఇస్తామంటే మిగతావారు ఎక్కడికి పోవాలని ప్రశ్నించారు. బీసీలందరికీ బీసీ బంధు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. వెంటనే సర్వర్‌లు సక్రమంగా పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని, లేనిచో ఆందోళనలను చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గోషామహల్ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ ఎం.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ సంగీతంపై మక్కువ కల్పించాలి



విద్యార్థులకు సంగీత పాటాలను బోధిస్తున్న రామలింగ శాస్త్రి

గన్‌ఫౌండ్రీ: నేటి యువతరానికి శాస్త్రీయ సంగీతంపై మక్కువ కల్పించాల్సిన అవసరం ఎంతగానో ఉందని ప్రముఖ కూచిపూడి నృత్య గురువులు పసుమర్తి రామలింగ శాస్త్రి అన్నారు. సంచలన స్కూల్ ఆఫ్ డ్యాన్స్ ఆధ్వర్యంలో జతుల నిర్మాణంపై నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ పద్మ కల్యాణ్ మాట్లాడుతూ.. ఈ వర్క్‌షాప్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం సంగీత గురువులు పసుమర్తి రామలింగ శాస్త్రి విద్యార్థులకు వివిధ అంశాలను నేర్పించారు.

సమస్యల పరిష్కారానికి వార్డు కార్యాలయం దోహదం



వార్డు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

గౌలిపురా: ప్రజా సమస్యల పరిష్కారానికి వార్డు కార్యాలయం దోహదపడుతాయని కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మి అన్నారు. చాపలగల్లీ జీహెచ్ఎంసీ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయాన్ని శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా.. తమ దృష్టికి తీసుకొస్తే ఆ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యాలయంలో జీహెచ్ఎంసీకి సంబంధించిన పలు విభాగాల అధికారులు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించి వాటిని వెంటనే అక్కడికక్కడే పరిష్కరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సర్కిల్–7 డీఎంసీ నరసింహ, గౌలిపురా ఏఈ రవిచంద్, బీజేపీ నాయకులు రఘుకాంత్, సుమన్ కుమార్ ముదిరాజ్, సర్వేశ్, అశోక్, అర్జున్ ఆర్య, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహన పెంపొందించాలి



కార్యక్రమంలో పాల్గొన్న ఐఏఎస్ అధికారిణి హరిచందన తదితరులు

గన్‌ఫౌండ్రీ: లింగ సమానత్వం, బాలికల రుతుక్రమంపై అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని పలువురు ప్రముఖులు అన్నారు. శనివారం ఆదర్శ్‌నగర్‌లోని బిర్లా సైన్స్ సెంటర్‌లో అమృత విశ్వ విద్యాపీఠం జెండర్ ఈక్వాలిటీ వర్కింగ్ గ్రూప్ ఆఫ్ సి20 ఆధ్వర్యంలో హైజింగ్ మేనేజ్‌మెంట్ మెన్‌స్ట్రువల్ హెల్త్ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఏఎస్ అధికారిణి హరిచందన మాట్లాడుతూ.. రుతుపరిశుభ్రత అనేది కేవలం ప్రచారం మాత్రమే కాదని, మన సమష్టి మద్దతును కోరే ఉద్యమమన్నారు. ఈ విషయంలో బాలికలతో పాటు తల్లిదండ్రులకు, బాలురులకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు. అడిషనల్ డీజీపీ డాక్టర్ సౌమ్య మిశ్ర మాట్లాడుతూ.. రుతు పరిశుభ్రతపై అవగాహన లేకపోవడంతో సోదరుడు తన సోదరిని చంపిన ఘటన ఈ అంశం అవగాహన ప్రాముఖ్యతను తెలియజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యునెస్కో ఇండియా ప్రతినిధి డాక్టర్ హ్యూమా మసూద్, విస్పర్ కమ్యూనికేషన్ హెడ్ కృతి దేశాయ్, అమృత హాస్పిటల్స్ వైద్యురాలు డాక్టర్ ప్రజ్ఞత పాల్గొన్నారు.

మంత్రి తలసాని సహకారంతో గోషామహల్ అభివృద్ధి



సమస్యలు తెలుసుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సహకారంతో గోషామహల్ నియోజకవర్గం నలుమూలలా అభివృద్ధి పనులు జోరుగా నిర్వహిస్తామని నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. గోషామహల్ హిందీనగర్‌లో ఆయన పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే మంత్రి తలసాని దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తున్నట్లు వివరించారు. అన్నిశాఖల అధికారులు ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అన్వర్, రాజు, రవి, సుధాకర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వర్క్‌షాప్ నిర్వహించడం అభినందనీయం




కళాకృష్ణను సత్కరిస్తున్న న్యాయమూర్తి రామలింగేశ్వర్‌రావు తదితరులు

సుల్తాన్‌బజార్: భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే శాస్త్రీయ సంగీతం, నృత్యం, లలిత కళలను పరిరక్షించి భావితరాలకు అందించాలని ఉమ్మడి హైకోర్టు పూర్వ న్యాయమూర్తి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా నియంత్రణ మండలి అధ్యక్షుడు జస్టిస్ రామలింగేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం సుల్తాన్‌బాజర్‌లోని శ్రీకృష్ణదేవారాయ తెలుగు భాషా నిలయంలో నవ్యనాటక సమితి 65వ వార్షికోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న 'నాయికా అభినయం'అనే వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలుగువారికి సొంతమైన, అపురూపమైన అభినయ విద్యలోని మెళకువలను, సాంప్రదాయ, శాస్త్రీయ నృత్య రీతుల్లో జ్ఞానాన్ని యువ కళాకారులకు అందించేలా ప్రముఖ నృత్యగురువు కళాకృష్ణ నేతృత్వంలో ఈ వర్క్‌షాప్‌ను రెండురోజుల పాటు నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. నృత్య గురువు కళాకృష్ణను నిర్వాహక సంస్థ పక్షాన ఘనంగా సత్కరించారు. గౌరవ అతిథిగా కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ఖజానా, మొక్కల శాఖ ఉప సంచాలకులు వసుంధర, సమన్వయ కర్త నిష్టల సుధామాల, నృత్యగురువులు రేణుకా ప్రభాకర్, డాక్టర్ ఇందిరా హేమ, వాణిరమణ, వేమరాజు విజయ్‌కుమార్, హరినాథ్‌బాబు, దుర్గారావ్, శర్మ పాల్గొన్నారు.

మహిళపై దాడి.. వ్యక్తికి 5 రోజుల జైలు

డబీర్‌పురా: మహిళపై దాడికి పాల్పడిన కేసులో ఓ వ్యక్తికి శనివారం నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రోపాలిటన్ కోర్టు మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ్‌రావు 5 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. పోలీసుల వివరాల ప్రకారం.. డబీర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసముండే శ్యామ్ లత ఈనెల 9న తన సోదరి లక్ష్మితో మాట్లాడుతుంది. ఆకస్మాతులగా లక్ష్మి భర్త నరేందర్ శ్యామ్ లత వద్దకు గొడవకు దిగడంతో పాటు దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై శ్యామ్ లత డబీర్‌పురా పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు నరేందర్ ఈ–పెట్టీ కేసు నమోదు చేసుకొని శుక్రవారం అరెస్ట్ చేసి నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రోపాలిటన్ కోర్టులో హాజరుపరచగా.. మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ్‌రావు నరేందర్‌కు 5 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. దీంతో పోలీసులు నరేందర్‌ను జైలుకు తరలించారు.

బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీలో బీజేపీ నాయకులు

గోల్కొండ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ 9 సంవత్సరాల పరిపాలనలో సాధించిన విజయాలపై బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో గుడిమల్కాపూర్‌లో బైక్ ర్యాలీ నిర్వహించారు. సబ్ కాసాత్.. సబ్ కా వికాస్.. సబ్ కా విశ్వాస్ కార్యక్రమంలో భాగంగా జరిగిన ఈ ర్యాలీలో బీజేపీ నాయకులు దేవర శ్రీనివాస్, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి పడాల అనంతకృష్ణ, శ్యాంలింగం, పడాల అనంతకృష్ణ, అశ్విన్ మోదీ తదితరులు పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహిద్దాం



ఆహ్వాన పత్రిక విడుదల చేస్తున్న మంత్రి తలసాని

లంగర్‌హౌస్: తెలంగాణ సంస్కృతి, ఖ్యాతి ప్రపంచనలుమూలలకు చేరేలా మన బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహిద్దామని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. తెలంగాణలో మొదటి పూజ అందుకొని బోనాలు నిర్వహించే గోల్కొండ జగదాంబిక ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మంత్రి తలసాని నివాసంలో ఆయనను శనివారం కలిశారు. కార్వాన్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ జీవన్‌సింగ్ ఆధ్వర్యంలో మంత్రిని కలిసి గోల్కొండ బోనాల ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఆయన చేతుల మీదుగా విడుదల చేయించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఆరెళ్ల జగదీష్‌యాదవ్, సొట్ల విజయలక్ష్మి, నర్సింగ్ రావు, విజయలక్ష్మి, దిలీప్‌కుమార్, రాంకుమార్, గరిషె శ్రీకాంత్‌తో పాటు నాయకులు కార్తీక్ ఉన్నారు.

పాతబస్తీ బీసీలకు ప్రాధాన్యం కల్పించాలి



గంగుల కమలాకర్‌ను కలిసిన పాతబస్తీ బీఆర్ఎస్ నాయకుల బృందం

చార్మినార్: రాష్ట్రంలోని బీసీ కులాలకు చెందిన అర్హులైన చేతి పని వృత్తిదారులందరికీ లక్ష రూపాలయల రుణం మంజూరు చేయనున్న సందర్భంగా పాతబస్తీ బీఆర్ఎస్ నాయకులు బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శనివారం బీఆర్ఎస్ నాయకులు పుస్తే శ్రీకాంత్, పెండ్యాల లక్ష్మన్‌రావు, గోపీ బృందం శనివారం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి బీసీ చేతి వృత్తిదారులకు మంజూరు చేయనున్న లక్ష రూపాలయల రుణం విషయంపై చర్చించారు. పాతబస్తీలోని బీసీలకు ప్రాధాన్యత కల్పించాలని మంత్రిని కోరారు.

పాత మిలిటరీ క్వార్టర్స్ వారికి న్యాయం జరిగేలా కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: గోల్కొండ ఎండీ లైన్స్‌తో పాటు కార్వాన్ నియోజకవర్గంలో ఇతర ప్రాంతాల్లో ఉన్న పాత నిజాం మిలిటరీ క్వార్టర్స్ యజమానులకు న్యాయం చేపిస్తానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శనివారం మహ్మదీ లైన్స్ చౌరస్తా వద్ద పాత మిలటరీ క్వార్టర్స్ యజమానుల అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మజ్లిస్ పార్టీ అధినేత హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చొరవతో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఈ పాత మిలటరీ క్వార్టర్స్‌ను అప్పటి నిజాం సైన్యం వారికి కేటాయించే విధంగా ఉత్తర్వులు జారీ చేశారన్నారు. తెలంగాణ ప్రభుత్వం సైతం మజ్లిస్ పార్టీ ప్రాతినిత్యంతో క్వార్టర్స్‌ను వాటి యజమానులకు కేటాయించేందుకు జీవో జారీ చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు హారూన్ ఫరాన్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాషా ఖాద్రీ

చార్మినార్: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ సూచించారు. యాకుత్‌పురా ఖురేషి లేన్‌లో శనివారం సూపర్‌బజార్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపునకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్తీల్లో ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలందరూ వినియోగించుకోవాలన్నారు. పేదలను ఆదుకోవడానికి స్వచ్ఛంద సంస్థలతో పాటు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో రెయిన్‌బజార్ కార్పొరేటర్ అబ్దుల్ వాసే, న్యాయవాది ఎజాజ్ అలీ ఖురేషితో పాటు కరీం ఖాన్, మహ్మద్ జహీర్, సలీం తదితరులు పాల్గొన్నారు.

క్రిమినల్ కోర్టులో మెడికల్ క్యాంపు




కోర్టులో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నాంపల్లి: తెలంగాణ న్యాయమూర్తుల సంఘం చొరవతో మెట్రోపాలిటన్ క్రిమినల్ కోర్టు ప్రాంగణంలోని మెట్రోపాలిటన్ న్యాయ సేవాధికార సంస్థ సమావేశ మందిరంలో శనివారం మెగా మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశారు. ఈ మెడికల్ క్యాంపును మెట్రోపాలిటన్ న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సెషన్స్ జడ్జి ప్రేమావతి ప్రారంభించారు. ఈ మెడికల్ క్యాంపులో జనరల్ ఫిజీషియన్, ఆర్థోపెడిక్, గైనకాలజిస్ట్, ఈఎన్‌టీ, ఆప్తమాలజిస్ట్ విభాగాలకు చెందిన వైద్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీబీపీ, బీపీ, షుగర్, హెచ్‌బీఏ1సీ, లిపిడ్ ప్రొఫైల్, కాల్షియం పనితీరు పరీక్ష, థైరాయిడ్ ప్రొఫైల్, సి.రియాక్టివ్ ప్రొటీన్, పూర్తి మూత్ర పరీక్ష, విటమిన్ బీ12, విటమిన్ డి3, వంటి పరీక్షలు నిర్వహించారు. జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ వెంకట్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సమన్వయంతో మెడికల్ క్యాంపును ఏర్పాటు చేసినట్లు న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కార్యదర్శి రాధికా జైస్వాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్రోపాలిటన్ క్రిమినల్ కోర్టు యూనిట్ జ్యుడిషియల్ ఆఫీసర్లు, కోర్టు ఉద్యోగులు విచ్చేసి సద్వినియోగం చేసుకున్నారు. ఆశావర్కర్లు హాజరై తమ సహాయ సహకారాలు అందించారు.

నకిలీ కేబుల్‌వైర్లు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

సుల్తాన్‌బజార్: నకిలీ కేబుల్‌వైర్లను విక్రయిస్తున్న వ్యక్తిని సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసి సుల్తాన్‌బజార్ పోలీసులకు అప్పగించారు. పోలీసుల వివరాల ప్రకారం.. కాచిగూడకు చెందిన ముకుల్ దుగ్గార్ (24) ఇతను సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జైన్ మార్కెట్‌లో శ్రీ బాలాజీ ఎంటర్‌ప్రైజెస్ పేరిట వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. ఫినోలెక్స్ నకిలీ కేబుళ్లను విక్రయిస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, సుల్తాన్‌బజార్ పోలీసులు అతని షాపుపై దాడిచేసి నకిలీ ఫినోలెక్స్ కేబుళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఢిల్లీకి చెందిన అనిల్ అనే వ్యక్తి ఈ నకిలీ కేబుళ్లను ఇతనికి అందజేస్తుండడంతో అక్రమంగా ఈ కేబుళ్లను ముకుల్ అనే వ్యక్తి విక్రయిస్తున్నాడని పోలీసులు తెలిపారు. అతని వద్ద 305 మీటర్ల 16 బ్యాగుల నకిలీ కేబుల్‌తో పాటు రూ.1.50 లక్షల విలువైన 100 మీటర్ల కేబుల్ వైర్లను స్వాధీనం చేసుకున్నారని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కాపీరైట్ కేసును నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


గోల్కొండ కోట చౌరస్తాకు కొత్త సొబగులు



కోట చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన కొత్త వీధి దీపాలు

గోల్కొండ: గోల్కొండ కోట చౌరాస్తా సరికొత్త విద్యుత్ దీపావతో కాంతులీనుతున్నది. కోట మెయిన్ గేటుతో పాటు కోట ఫెన్సింగ్, కోట గోడల పొడవునా కొత్త అధునాతన వీధిలైట్లను ఏర్పాటు చేశారు. సాయంత్రం కాగానే స్థానికులు తరలివచ్చి ఎంతో ఆసక్తిగా ఈ విద్యుత్ దీపాలను తిలకిస్తున్నారు. అదే విధంగా కోటలో రాత్రి జరిగే లైట్‌అండ్ సౌండ్ షోకు వచ్చే పర్యాటకులు సైతం అధునాతన విద్యుత్ దీపాలను చూసి వావ్ అంటున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు మైత్రి సభ్యుల సహకారం అవసరం



ఇన్‌స్పెక్టర్ రవి, ఎస్ఐలను సత్కరించిన సౌత్‌వెస్ట్ వెస్ట్ జోన్ మైత్రి కమిటీ సభ్యులు

అబిడ్స్: శాంతిభద్రతల పరిరక్షణకు మైత్రి సభ్యుల సహకారం అవసరమని గుడిమల్కాపూర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.రవి పేర్కొన్నారు. మైత్రి సభ్యులు, స్థానిక ప్రజల సహకారంతో రాబోయే పండగలను ప్రశాంత వాతవారణంలో అందరూ జరుపుకోవాలన్నారు. శనివారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మైత్రి సభ్యుల సమావేశం నిర్వహించారు. వారికి పలు సూచనలు చేశారు. అన్ని పండుగలు ప్రజలు ప్రశాంతంగా, సంతోషకరంగా జరుపుకునే విధంగా అందరూ సహకరించాలన్నారు. బక్రీదు వేడుకలను పురస్కరించుకుని రౌండ్ ది క్లాక్ పద్ధతిలో నిఘా ముమ్మరం చేశామన్నారు. ఇన్‌స్పెక్టర్ రవితో పాటు ఎస్ఐలు నాయుడు, గోపీ, బాషా, సాదుదీన్‌ను మైత్రి సభ్యులు ఘనంగా సత్కరించారు.